సాక్షి బాపట్ల

మంగళవారం । 27 । ఫిబ్రవరి । 2024



ఈవీఎం గోడౌన్ల పరిశీలన

గుంటూరు వెస్ట్ : ఆర్డీఓ కార్యాలయ ప్రాంగణంలో ఉన్న ఈవీఎం గోడౌన్లను అడిషనల్ చీఫ్ ఎలక్టోరల్ అధికారి ఎంఎన్ హరేంద్ర ప్రసాద్, జిల్లా కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి పరిశీలించారు.



బైజూస్ ద్వారా బోధించాలి

నకరికల్లు: బైజూస్ ద్వారా బోధన చేస్తే మంచి ఫలితాలు వస్తాయని పాఠశాల విద్య జేడీ బి.లింగేశ్వర్‌రెడ్డి సూచించారు. స్థానిక ఉన్నత పాఠశాలను సోమవారం సందర్శించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 516.50 అడుగుల వద్ద ఉంది. ఎస్ఎల్‌బీసీకి 1,350 క్యూసెక్కులు విడుదలవుతోంది.

న్యూస్‌రీల్

కోటప్పకొండ తిరునాళ్లకు సన్నద్ధం



నరసరావుపేట రూరల్: మహాశివరాత్రిని పురస్కరించుకుని మార్చి8వ తేదీన నిర్వహించే కోటప్పకొండ తిరునాళ్లకు పోలీసు అధికారులు సన్నద్ధంగా ఉండాలని జిల్లా ఎస్పీ రవిశంకర్‌రెడ్డి తెలిపారు. కోటప్పకొండ త్రికోటేశ్వర స్వామిని సోమవారం ఆయన దర్శించుకున్నారు. అనంతరం తిరునాళ్ల ఏర్పాట్లను పరిశీలించారు. కొండ దిగువన నరసరావుపేట, చిలకలూరిపేట వైపు నుంచి వచ్చే వాహనాల పార్కింగ్ స్థలాలు, ప్రభలు నిలిపే స్థలం , కొండకు వచ్చే మార్గాలను పరిశీలించారు. స్వామివారి దర్శనానికి వచ్చే యాత్రికుల క్యూలైన్‌లు, రక్షణ చర్యలపై అధికారులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ రవిశంకర్‌రెడ్డి మాట్లాడుతూ గత సంవత్సరం తిరునాళ్ల సమయంలో ఎదురైన అనుభవాలను దృష్టిలో ఉంచుకుని, సమస్యలను అధిగమించే విధంగా చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. ట్రాఫిక్ సమస్యపై ప్రత్యేక దృష్టి సారించినట్టు తెలిపారు. ఆర్‌అండ్‌బీ, పీఆర్, పోలీసుశాఖ సమన్వయంతో కొండకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా రోడ్లు సిద్ధం చేయాలని సూచించినట్టు తెలిపారు. అదనపు ఎస్పీ రామచంద్రరాజు, డీఎస్పీ వీఎస్ఎన్ వర్మ, ఎస్బీ సీఐలు ప్రభాకర్, బాలనాగిరెడ్డి, రూరల్ సీఐ మల్లికార్జున రావు, ఎస్ఐ రోశయ్య తదితరులు పాల్గొన్నారు.

హీరా ఇస్లామిక్ స్కూల్‌కు ఎమ్మెల్యే ఆర్కే విరాళం



మంగళగిరి: నగరంలోని హీరా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నడుస్తున్న హీరా ఇస్లామిక్ స్కూల్‌లో తాగునీటి వసతి, మౌలిక సదుపాయాలు, డిజిటల్ క్లాస్ రూమ్ నిమిత్తం మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) రూ.2లక్షల విరాళాన్ని సోమవారం వైఎస్సార్ సీపీ పట్టణ నాయకుల చేతుల మీదగా ఇప్పించారు. కార్యక్రమంలో స్కూల్ నిర్వాహకులు ఆలీబాషాఖాన్, వైఎస్సార్ సీపీ నాయకులు మునగాల మల్లేశ్వరరావు, ఎండీ ఇక్బాల్, ఆకురాతి రాజేష్, ఎండీ ఫిరోజ్, రాచకొండ వెంకటేశ్వరరావు, దొడ్డక కృష్ణ, కుంచాల కిషోర్, మల్లవరపు సుధారాణి, సంకె సునీత పాల్గొన్నారు.

స్కూల్‌బస్సును ఢీకొన్న లారీ

నరసరావుపేట రూరల్: స్కూల్ బస్సుకు జరిగిన ప్రమాదంలో పలువురు విద్యార్థులకు స్వల్పగాయాలైన ఘటన కోటప్పకొండ రోడ్డు జంక్షన్‌లో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని ఓ ప్రైవేటు స్కూల్‌కు చెందిన బస్సు విద్యార్థులతో ప్రయాణిస్తూ ఆర్‌టీఓ కార్యాలయంలో సమీపంలోని కోటప్పకొండ రోడ్డు జంక్షన్ దాటుతుండగా వినుకొండ వైపు వెళ్తున్న లారీ ఢీకొట్టింది. స్కూల్ బస్సు డ్రైవర్ సెల్‌ఫోన్ మాట్లాడుతూ జంక్షన్ దాటే ప్రయత్నం చేయడమే ప్రమాదానికి కారణమని తెలుస్తుంది. స్కూల్ బస్సును గుర్తించిన లారీ డ్రైవర్ వేగాన్ని నియంత్రించడంతో పెనుప్రమాదం తప్పింది. ఈ ప్రమాదంలో బస్సులోని కొందరు విద్యార్థులకు స్వల్ప గాయాలయ్యాయి.

యార్డుకు 1,59,820 బస్తాల మిర్చి



కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు సోమవారం 1,59,820 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 1,42,382 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.8,500 నుంచి రూ. 20,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి 21,000 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.13,000 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 1,03,060 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఇన్‌చార్జి కార్యదర్శి కాకుమాను శ్రీనివాసరావు తెలిపారు.

పర్చూరులో వైఎస్సార్ సీపీ జోష్

ఏటిని నిట్టనిలువునా నిలబెడతా.. నేను గాలికి రంగులేస్తా అంటూ గారడి చేసే బాబుకు రోజులు దగ్గరపడ్డాయి. లేని బలాన్ని సృష్టించి గెలుపుగ్గురం అంటూ డ్రామాలు ఇక చెల్లవ్.. దొంగ ఓట్లతో నెగ్గడం అలవాటుగా మార్చుకున్న పచ్చ బ్యాచ్‌కి ముచ్చెమటలు పడుతున్నాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఇంటింటికి సంక్షేమాన్ని అందించడం, గ్రామ సచివాలయ వ్యవస్థతో ప్రతి వర్గానికి చేరువైంది. నవరత్నాలు ప్రతి గడపను తట్టాయి. ఓటర్ల పేరుతో ఏలూరి మోసం బట్టబయలు అయింది. దీంతో ప్రజలు ఛీత్కరిస్తున్నారు. వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు యడం బాలాజీని పర్చూరు సమన్వయకర్తగా నియమించడంతో వైఎస్సార్ సీపీ శ్రేణుల్లో జోష్ వచ్చింది.

- యడం బాలాజీ రాకతో మారిన ముఖచిత్రం
- కేడర్‌లో గెలుపుపై ధీమా
- కలిసి రానున్న సామాజిక సమీకరణలు



నియోజకవర్గ నాయకులతో సమావేశమైన సమన్వయకర్త యడం బాలాజీ (ఫైల్)

మార్టూరు: ఉద్దండుల కేంద్రం పర్చూరు. ఇక్కడ నుంచి అనేక మంది మంత్రులుగాను పనిచేసిన చరిత్ర ఉంది. గాదె వెంకటరెడ్డి, దగ్గుబాటి వెంకటేశ్వరరావు వారు పోటీపడిన ప్రాంతం. నియోజకవర్గంలో పర్చూరు, కారంచేడు, చినగంజాం, మార్టూరు, యద్దనపూడి మండలాలు ఉన్నాయి. మొత్తం ఓటర్లు 2,12,000 వరకు ఉన్నారు. ఇక్కడ గతంలో టీడీపీ, కాంగ్రెస్ పార్టీలు పోటాపోటీగా ఉండేవి. వైఎస్సార్ సీపీ రాకతో కాంగ్రెస్ పార్టీ బలహీన పడింది. పోటీ ప్రధానంగా వైఎస్సార్ సీపీ, టీడీపీ మధ్య నెలకొంది.

ప్రభావం ఇలా...

నియోజకవర్గంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ ముస్లిం, మైనారిటీ ఓటు బ్యాంకు బలంగా ఉంది. వైఎస్సార్ సీపీని పర్చూరులో గెలుపు గుర్రం ఎక్కించడానికి ఇక్కడ కమ్మ, కాపు, రెడ్డి సామాజిక వర్గాలు కీలకం . ఇక్కడ గతంలో వైఎస్సార్ సీపీకి ఇన్‌చార్జిలుగా కమ్మ సామాజిక వర్గానికి చెందిన రావి రామనాథం బాబు, గొట్టిపాటి భరత్ పనిచేశారు. రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు బత్తుల బ్రహ్మానందరెడ్డి ఈప్రాంతానికి చెందిన వారే గతంలో ఓ సారి పోటీ చేసి ఓటమి చెందారు.

దొంగ ఓట్లపై పోరాటంతో..

ప్రస్తుత ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఇక్కడ దొంగ ఓట్ల దందాతో రెండు సార్లు గెలుపొందారు. ఓటరు జాబితాపై దృష్టి పెట్టిన వైఎస్సార్ సీపీ పోరాటం చేసింది. ఎక్కడెక్కడ ఓట్లు చేర్పించారు.. ఎక్కడ నుంచి డబ్బు బదలాయించారు అనే విషయాలను ఆధారంతో సేకరించి ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా ఇంటింటికి వెళ్లి కూడా దొంగ ఓట్ల నమోదుపై దర్యాప్తు చేశారు. వేల సంఖ్యలో ఉన్న బోగస్ ఓట్ల తొలగించిన విషయంలో వైఎస్సార్ సీపీ సక్సెస్ అయింది. ఇది కూడా శ్రేణుల్లో ఉత్సాహం నింపింది.

సామాజిక వర్గాల వారీగా ఓటర్లు

కమ్మ	50,000
ఎస్సీ	50,000
కాపు	20,000
రెడ్డి	19,000
బీసీ	40,000
ఇతరులు	25000

సీనియర్ల సంపూర్ణ మద్దతు

వైఎస్సార్ సీపీ శ్రేణులు ఐక్యంగా ముందుకు వెళ్తున్నాయి. కమ్మ సామాజిక వర్గానికి చెందిన రామనాథంబాబు, భరత్ ఓటు బ్యాంకును పార్టీకి అనుకూలంగా మార్చుకునేందుకు ఇప్పటికే ప్రణాళిక సిద్ధం చేశారు. తాడికొండ నియోజకవర్గ పరిశీలకుడిగా ఉన్న బత్తుల బ్రహ్మానందరెడ్డి, యడం బాలాజీ గెలుపు కోసం పూర్తిగా సమయం కేటాయించనున్నారు. సొంత సామాజికవర్గమైన కాపులు బాలాజీకి మద్దతుగా నిలబడడం అదనపు బలం.

ప్రభుత్వ పథకాలే నన్ను గెలిపిస్తాయి..

గత ఐదేళ్లుగా సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి కుల, మత, పార్టీలకు అతీతంగా పాలన చేస్తున్నారు. ప్రజలకు నేరుగా సంక్షేమ పథకాల లబ్ధి అందిస్తున్నారు. ఏ ప్రభుత్వమూ తలపెట్టని విధంగా పథకాలను అమలు చేస్తున్నారు. సంక్షేమ పథకాలు నచ్చి పార్టీ ఇన్‌చార్జిగా వచ్చాను. నియోజకవర్గంలో ప్రశాంత వాతావరణం నెలకొల్పడమే లక్ష్యం. నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ పర్చూరులో విజయకేతనం ఎగురవేస్తా.

– యడం బాలాజీ,
నియోజకవర్గ సమన్వయకర్త, పర్చూరు

నియోజకవర్గ సమన్వయకర్తగా బాధ్యతలు సేకరించిన అనంతరం అన్ని వర్గాల ప్రజలు వచ్చి మద్దతు పలుకుతున్నారు. గత ఎన్నికల్లో ఏలూరి సాంబశివ రావు అతి తక్కువ మెజారిటీతో గెలుపొందిన విషయం విదితమే. యడం బాలాజీ రాకతో వైఎస్సార్ సీపీ శ్రేణులు కదంతొక్కుతున్నాయి.

సిద్ధంతో కొత్త ఉత్సాహం

- సమన్వయకర్త పానెం చిన హనిమిరెడ్డి
- అద్దంకిలో రాక్షసపాలన పోయింది
- బాబు అంటే జన్మభూమి కమిటీలే గుర్తు
- సిద్ధం సభ పోస్టర్ల ఆవిష్కరణ



సిద్ధం పోస్టర్ ఆవిష్కరిస్తున్న చిన హనిమిరెడ్డి

అద్దంకి రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నిర్వహిస్తున్న 'సిద్ధం' సభలు ప్రజలకు, కార్యకర్తలకు, నాయకులకు కొత్త ఉత్సాహాన్ని ఇస్తోందని వైఎస్సార్ సీపీ అద్దంకి నియోజకవర్గ సమన్వయకర్త పానెం చిన హనిమిరెడ్డి పేర్కొన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మార్చి 3వ తేదీన మేదరమెట్ల సమీపంలో నిర్వహించనున్న సిద్ధం సభపై సోమవారం సమావేశం నిర్వహించారు. 'సిద్ధం' పోస్టర్ ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో టీడీపీ నాయకుల బెదిరింపులు ఇక చెల్లవని హెచ్చరించారు. భయపెట్టి బలవంతంగా పార్టీలోకి చేర్చుకున్న వారు వెంటనే తిరిగి వైఎస్సార్ సీపీలో చేరుతున్నారని ఈ సందర్భంగా చెప్పారు. నిజం గ్రహించి, ఇంతకాలం అద్దంకిలో ప్రజలను రాక్షస పాలన అందించిన వారికి చరమగీతం పడుదామని పిలుపునిచ్చారు. సిద్ధం సభ ఇక్కడ ఏర్పాటు చేయటంలో ఈ ప్రాంతంపై సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి నియోజకవర్గంపై ఉన్న శ్రద్ధ అర్థం అవుతుందని వివరించారు. ప్రతి ఒక్కరూ కుటుంబ సమేతంగా సిద్ధం సభకు రావాలని కోరారు. సంక్షేమ పథకాలకు చిరునామాగా సీఎం వైఎస్ జగన్ నిలిచారని చెప్పారు. చంద్రబాబు నాయుడు అంటే జన్మభూమి కమిటీ ఒక్కటే గుర్తుకు వస్తుందని ఎద్దేవా చేశారు. వైఎస్సార్ కుటుంబంలో కూడా చిచ్చుపెట్టిన ఘనుడు చంద్రబాబు అని విమర్శించారు. జగనన్న మొదటి నుంచి పొత్తులు లేకుండా ఒంటరిగానే పోటీ చేసి ప్రజల మనస్సులు గెలుచుకున్నారని గుర్తు చేశారు.

సభను విజయవంతం చేయండి..

అద్దంకి నియోజకవర్గంలోని మేదరమెట్ల సమీపంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించ తలపెట్టిన సిద్ధం సభ సుమారు 400 వందల ఎకరాల స్థలంలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు ఇబ్బందులు పడకుండా అన్ని సౌకర్యాలు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సభకు రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి ప్రజలు భారీ సంఖ్యలో ప్రజలు వచ్చే అవకాశం ఉందని వివరించారు. ఏర్పాట్లు ప్రారంభమయ్యాయని రాత్రి, పగలు కష్టపడి పూర్తిచేస్తున్నారని, చరిత్రలో నిలిచిపోయేలా సభ ఉంటుందన్నారు. కార్యక్రమాల్లో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు జ్యోతి హనుమంతరావు, అద్దంకి మున్సిపల్ చైర్మన్ ఎల్.ఎస్తేరమ్మ, మండల అధ్యక్షుడు పానెం శ్రీనివాసరెడ్డి, పట్టణ అధ్యక్షుడు కాకాని రాధాకృష్ణమూర్తి పాల్గొన్నారు.

'సిద్ధం' సభకు పకడ్బందీ ఏర్పాట్లు

- జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్
- మేదరమెట్లలో స్థల పరిశీలన

మేదరమెట్ల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హాజరు కానున్న 'సిద్ధం' సభకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశించారు. కొరిశపాడు మండలంలోని పీ గుడిపాడు 16వ నంబరు జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న ప్రదేశాన్ని సోమవారం పరిశీలించారు. ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష చేశారు. సభ జరిగే సమయంలో జాతీయ రహదారిపై రాకపోకలు సాగించే వాహనదారులకు ఎలాంటి అసౌకర్యం తలెత్తకుండా చూడాలని కోరారు. బందోబస్తు కోసం వచ్చే పోలీసులకు వసతి సౌకర్యం కల్పించేందుకు కూడా చర్యలు తీసుకోవాలని ఎస్పీ సూచించారు. ఎస్పీ వెంట చీరాల డీఎస్పీ ప్రసాదరావు, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ మల్లికార్జునరావు, అద్దంకి రూరల్ సీఐ శివరామకృష్ణారెడ్డి, అద్దంకి టౌన్ సీఐ కృష్ణయ్య, సంతమాగులూరు సీఐ నరసింహారావు, మార్టూరు సర్కిల్ సీఐ సీతారామయ్య, మార్టూరు సీఐ రాజశేఖరరెడ్డి, చీరాల రూరల్ సీఐ సత్యనారాయణ పాల్గొన్నారు.

స్పందన అర్జీలు తక్షణమే పరిష్కరించాలి

బాపట్ల: ప్రజల నుంచి వచ్చిన అర్జీలను అధికారులు తక్షణమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా తెలిపారు. కలెక్టరేట్‌లోని స్పందన సమావేశ మందిరంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. గ్రామదర్శినిలో వచ్చిన అర్జీలు ఎక్కువ మొత్తంలో పెండింగ్ ఉండటంతో అధికారులపై అసంతృప్తి వ్యక్తం చేశారు. అర్జీలు పునరావృతం కాకుండా చూడాలని అధికారులను హెచ్చరించారు. చిత్తశుద్ధితో విధులు నిర్వహిస్తే ప్రజలు సమస్యలతో మరోసారి ఎందుకు వస్తారని అధికారులను ప్రశ్నించారు.



అర్జీలు పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా

వెబ్‌ల్యాండ్‌లో నమోదు చేయటంలేదు



నాకు ఉన్న పొలాన్ని వెబ్‌ల్యాండ్‌లో నమోదు చేయాలని వీఆర్వో చుట్టూ తిరుగుతున్నా. పట్టించుకోవటంలేదు. భూమికి సంబంధించిన పలుసార్లు కాగితాలు ఇచ్చినా పనిచేయడం లేదు. చర్యలు తీసుకోవాలి.

–మారిన లక్ష్మారెడ్డి, కుక్కలవారిపాలెం

నా స్థలాన్ని ఆక్రమించుకున్నారు



మా ఇంటి స్థలాన్ని పక్కనే ఉన్న రమేష్ అనే వ్యక్తి అక్రమించాడు. అడిగితే బెదిరిస్తున్నాడు. ఎన్నిసార్లు పెద్దలతో పంచాయితీ చేసిన వినడం లేదు. నా స్థలాన్ని ఇవ్వటంలేదు. స్థలం ఇప్పించేందుకు చర్యలు తీసుకోవాలి.

–అమీనమ్మ, నరసాయపాలెం

విద్యార్థుల్లో ప్రతిభను వెలికి తీసేందుకు పోటీలు

జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా

బాపట్ల: విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీసేందుకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలు నిర్వహిస్తోందని జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా తెలిపారు. కలెక్టరేట్లోని స్పందన హాల్లో ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాల పోస్టర్లను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా లీడ్ బ్యాంకు మేనేజర్ కె.శివకృష్ణ మోహన్ మాట్లాడుతూ సోమవారం నుంచి మార్చి ఒకటో తేదీ వరకు జిల్లా స్థాయిలో వ్యాసరచన, నినాదం, పోస్టర్ విభాగాల్లో పోటీలు పాఠశాల, ఇంటర్మీడియెట్ విద్యార్థులకు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వ్యాస రచన విభాగంలో 'నేను రాత్రికి రాత్రే మిల్లియనియర్‌గా మారితే ఆ డబ్బును ఎలా ఉపయోగిస్తాను' అంశంపై 300 పదాలతో ఇంగ్లిష్, తెలుగు, హిందీ భాషల్లో రాయాలని తెలిపారు. నినాదం విభాగంలో 'పొదుపు, చక్ర వడ్డీ యొక్క శక్తి' అనే అంశం, పోస్టర్ విభాగంలో 'డిజిటల్, సైబర్ పరిశుభ్రత' అనే అంశంపై చేతితో గాని, డిజిటల్‌గా గాని వేయవచ్చన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ రంజిత్‌బాషా

పోలింగ్ ప్రక్రియపై అవగాహన ఉండాలి

ఎన్నికల పోలింగ్ ప్రక్రియపై ఎన్నికల అధికారులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా తెలిపారు. బాపట్ల వ్యవసాయ కళాశాల ఆడిటోరియంలో ఎన్నికల నిర్వహణపై అవగాహన సమావేశం సోమవారం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఓటు హక్కును అర్హులైన ప్రతి ఒక్కరూ వినియోగించుకునే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్, అడిషనల్ ఎస్పీ మహేష్, జిల్లా రెవెన్యూ అధికారి సత్తిబాబు, బాపట్ల, రేపల్లె ఆర్డీఓలు రవీందర్, షారోన్ పాల్గొన్నారు.

'పది' పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

జిల్లా ప్రత్యేకాధికారి రవీంద్రనాథ్ రెడ్డి

చీరాల అర్బన్: పదో తరగతి పరీక్షలు నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేయాలని పాఠ్యపుస్తక విభాగం జాయింట్ డైరెక్టర్, పదో తరగతి పరీక్షల జిల్లా ప్రత్యేకాధికారి కె.రవీంద్రనాథ్ రెడ్డి కోరారు. స్థానిక వీఆర్ఎస్‌వైఆర్ఎన్ కాలేజీ ఆడిటోరియంలో పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్టుమెంట్ ఆఫీసర్ల సమావేశం సోమవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మార్చి 18 నుంచి 30వ తేదీ వరకు పరీక్షలు నిర్వహించనున్నట్లు చెప్పారు. బాపట్ల జిల్లాలో ఈ ఏడాది మొత్తం 18,910 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. 108 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. సమావేశంలో డీఈఓ కె.నారాయణరావు, బాపట్ల, చీరాల డెప్యూటీ డీఈఓలు జి.వెంకటేశ్వర్లు, ఆర్.శ్రీనివాసులు పాల్గొన్నారు.

దూసుకొచ్చిన మృత్యువు

- రోడ్డు ప్రమాదంలో ముగ్గురు డ్రైవర్లు మృతి
- వీరిది నక్కబొక్కలపాడు
- ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు డ్రైవర్లు
- కాకినాడ జిల్లా ప్రత్తిపాడు వద్ద ఘటన



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన లారీ డ్రైవర్లు



ప్రసాద్ (ఫైల్)



కిషోర్ (ఫైల్)



నాగయ్య(ఫైల్)

బల్లికురవ: టైరు పంక్చర్ వేసుకునే పనిలో నిమగ్నమైన డ్రైవర్లపైకి ఆర్టీసీ బస్సు దూసుకెళ్లడంతో ముగ్గురు డ్రైవర్లు అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యారు. ఈ ఘటన కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలంలోని పాదాలమ్మ తల్లి దేవాలయం సమీపంలో సోమవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. స్థానికులు అందించిన సమాచారం మేరకు.. బాపట్ల జిల్లా బల్లికురవ మండలంలోని కొండాయపాలేనికి చెందిన బెల్లంకొండ సుబ్బారావుకు రెండు లారీలున్నాయి. మండలంలోని నక్కబొక్కలపాడుకు చెందిన దాసరి ప్రసాద్(45), దాసరి కిషోర్(40), బండి నాగయ్య(24) డ్రైవర్లుగా పనిచేస్తున్నారు. పది రోజుల క్రితం లారీలకు సరుకు లోడ్ చేసుకుని వెళ్లారు. ఈ క్రమంలో కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలంలోని పాదాలమ్మ తల్లి దేవాలయం సమీపంలో ఒక లారీ కుడి వైపు టైరు పంక్చర్ కావడంతో లారీని రోడ్ మార్జిన్‌లో నిలిపివేశారు. ముందు వెళ్తున్న లారీ డ్రైవర్‌కు సమాచారం ఇవ్వడంతో ఆ డ్రైవర్ పంక్చర్ అయిన లారీ వద్దకు వచ్చాడు. ముగ్గురూ కలసి టైరు మార్చే పనిలో ఉన్నారు.

బస్సు రూపంలో...

ఈక్రమంలో విశాఖ నుంచి రాజమండ్రి వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు వేగంగా వచ్చి పనుల్లో నిమగ్నమైన ముగ్గురు డ్రైవర్లపైగా వెళ్లింది. దీంతో వారు అక్కడిక్కడే మృతి చెందారు. ఢీకొట్టిన బస్సు ఆగకుండా వెళ్తుండంతో దగ్గరలో ఉన్న హైవే అంబులెన్స్ వెంబడించి బస్సును ఆపి డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు.

మరో రెండు రోజుల్లో..

నక్కబొక్కలపాడుకు చెందిన దాసరి ప్రసాద్, కిషోర్ అన్నదమ్ములు. పదేళ్ల నుంచి లారీ డ్రైవర్లుగా పనిచేస్తున్నారు. ఇదే గ్రామానికి చెందిన బండి నాగయ్య రెండు సంవత్సరాలుగా డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. వీరంతా ఒకసారి పనికి వెళ్తే తిరిగి పది, పదేహను రోజులకు ఒక సారి ఇంటికి వస్తుంటారు. రెండు రోజుల క్రితం తామంతా మరో రెండు రోజుల్లో ఇంటికి రానున్నట్లు కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి చెప్పారు. ఇంతలో వారిని విధి రోడ్డు ప్రమా దరూపంలో కబళించింది.

పరీక్ష రాస్తున్న కుమార్తె..


మృతుడు దాసరి ప్రసాద్‌కు భార్య వరలక్ష్మి, కుమార్తెలు లక్ష్మి కిరణాంజలి, లిఖిత ప్రసన్నలక్ష్మి ఉన్నారు. పెద్దమ్మాయి స్థానిక ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతోంది. రెండో కుమార్తె తొమ్మిదో తరగతి చదువుతోంది. పెద్దమ్మాయి ప్రీ ఫైనల్ రాస్తుండటంతో తల్లి వారికి తండ్రి మృతిచెందిన విషయం చెప్పలేదు. ప్రసాద్ తమ్ముడు కిషోర్‌కు భార్య శ్యామల, ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. భార్యాభర్తలకు విభేదాలు రావడంతో ఆమె పుట్టింట్లో ఉంటోంది.

బిడ్డ బారసాల కొస్తానని..



బండి నాగయ్య భార్య లిల్లీ గ్రేస్ 21 రోజుల క్రితం బాబుకు జన్మనిచ్చింది. భార్య ఒంగోలు జీజీహెచ్‌లో కాన్పు కాగా తల్లీబిడ్డలను ఇంటికీ చేర్చి పది రోజల క్రితం డ్యూటీకి వెళ్లాడు. సోమవారం కుమారుడికి స్నానం కావడంతో వస్తానని భార్యకు ఫోన్ చేసి చెప్పాడు. ఈలోపే రోడ్డు ప్రమాదం అతన్ని బలి తీసుకుంది. ఒకే గ్రామానికి చెందిన ఇద్దరు అన్నదమ్ములు, మరో యవకుడు లారీ డ్రైవర్లు పనిచేస్తూ అందరికీ తలలో నాలుకగా ఉంటున్న వ్యక్తుల మృతి వార్త విని బంధువులు, విలపిస్తున్నారు. లారీ యజమాని మృతుల బంధువులను తీసుకుని ప్రమాదం జరిగిన జిల్లాకు వెళ్లారు. మృతదేహాలను పోస్టుమార్టం తరువాత మంగళవారం స్వగ్రామానికి తీసుకురానున్నట్లు బంధువులు తెలిపారు. దీంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

రైల్వే స్టేషన్ అభివృద్ధికి రూ.27.38 కోట్లు



బాపట్లటౌన్: అమృత్ భారత్ స్టేషన్ల అభివృద్ధిలో భాగంగా బాపట్ల రైల్వేస్టేషన్‌ను రూ.27.38 కోట్లతో అభివృద్ధి చేయనున్నట్లు ఎంపీ నందిగం సురేష్ తెలిపారు. పనుల శిలాఫలకాన్ని సోమవారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ నిధులతో రైల్వేస్టేషన్‌లో మెరుగైన సదుపాయాలు కల్పించడంతోపాటు అదనంగా రైల్వే లైన్లను ఏర్పాటుచేయటం జరుగుతుందని వివరించారు. ముఖ్యంగా స్టేషన్ యాక్సెస్, సర్క్యులేటింగ్ ఏరియాలు, వెయిటింగ్ హాళ్లు, టాయిలెట్లు, లిఫ్ట్, ఎస్కలేటర్లు, పరిశుభ్రత, ఉచిత వైఫై లాంటి సౌకర్యాలు ప్రయాణికులకు అందుబాటులోకి వస్తాయన్నారు. కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

వ్యక్తిపై దాడి కేసులో ఎస్ఐ, కానిస్టేబుల్‌కు మూడేళ్ల జైలు

ఒంగోలు: పోలీస్‌స్టేషన్‌కు వెళ్లిన వ్యక్తిపై దాడి కేసులో ఎస్ఐ బి.జగన్‌మోహన్‌రావు(ప్రస్తుతం తిరుపతి సీసీఎస్), కానిస్టేబుల్ కాసా కిరణ్‌కుమార్(ప్రస్తుతం చీరాల ప్రభుత్వ రైల్వే పోలీసు స్టేషన్)లకు మూడేళ్ల జైలు, ఒక్కొక్కరికి రూ.23 వేల జరిమానా విధిస్తూ జిల్లా జడ్జి డి.అమ్మన్నరాజా సోమవారం తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం.. బాపట్ల జిల్లా జె.పంగులూరు పోలీసుస్టేషన్‌లో ఎస్ఐగా జగన్‌మోహన్ రావు, కానిస్టేబుల్‌గా కాసా కిరణ్‌కుమార్ విధులు నిర్వహిస్తున్నారు. 2016లో అదే పోలీసు స్టేషన్ పరిధిలో కోటపాడుకు చెందిన నేలపాటి ఇమ్మానుయేలు, మండా వెంకటేశ్వర్లు మధ్య రూ.2 వేలు కూలి డబ్బులకు సంబంధించి ఘర్షణ పడ్డారు. అద్దంకి ఆస్పత్రిలో చేరి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో గ్రామ పెద్దలు జోక్యం చేసుకుని ఇద్దరి మధ్య రాజీ చేశారు. జి.తిరుపాలు, పెద్దలు పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఇద్దరూ రాజీ కుదుర్చుకున్న విషయాన్ని ఎస్ఐకి వివరించారు. ఎస్ఐ ఆగ్రహం వ్యక్తం చేశాడు. పరస్పర ఫిర్యాదులు చేసుకున్నవారిలో ఒకరిని కొడుతుండడంతో తిరుపాలు అభ్యంతరం తెలిపాడు. దీంతో ఆగ్రహించిన ఎస్ఐ, కానిస్టేబుల్ అభ్యంతరం వ్యక్తం చేసిన తిరుపాలు రబ్బరు ట్యూబుతో కొట్టి వదిలేశారు. దీంతో గాయపడిన తిరుపాలు నేరుగా అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు చేరుకుని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అప్పట్లో పలు సెక్షన్ల కింద కేసు నమోదైంది. దీనిపై ఎస్సీ, ఎస్టీ సెల్ డీఎస్పీ ఎం.బాలసుందరరావు(ప్రస్తుతం మార్కాపురం డీఎస్పీ) విచారణ జరిపి కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. నేరం రుజువు కావడంతో ఎస్ఐ జగన్‌మోహన్‌రావు, కానిస్టేబుల్ కిరణ్‌కుమార్‌లకు మూడేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.10 వేలు జరిమానా, జరిమానా చెల్లించని పక్షంలో 3 నెలల సాధారణ జైలు, ఐపీసీ సెక్షన్ 506 కింద రెండేళ్ల జైలుశిక్ష, రూ.3 వేలు జరిమానా, జరిమానా చెల్లించని పక్షంలో రెండు నెలల సాధారణ జైలు, అట్రాసిటీ చట్టం కింద 3 సంవత్సరాల జైలుశిక్ష, పది వేలు జరిమానా, జరిమానా చెల్లించని పక్షంలో మూడు నెలల సాధారణ జైలుశిక్ష విధిస్తూ జడ్జి డి.అమ్మన్నరాజా తీర్పునిచ్చారు. ఈ శిక్షలన్నీ ఏకకాలంలో అమలు చేయాలని, నిందితులు ప్రతి ఒక్కరూ రూ.23 వేలు జరిమానా చెల్లించాలని తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ తరఫున ప్రత్యేక అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ సి.శ్రీనివాసమూర్తి వాదించారు.

‘సిద్ధం’ సభకు తరలిరండి

ఎంపీ మోపిదేవి


మాట్లాడుతున్న ఎంపీ మోపిదేవి

చెరుకుపల్లి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హాజరుకానున్న సిద్ధం సభకు తరలిరావాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎంపీ మోపిదేవి వెంకటరమణారావు పేర్కొన్నారు. సిద్ధం సభపై పార్టీ నాయకులు, కార్యకర్తల సమావేశం సోమవారం నిర్వహించారు. సమావేశానికి పార్టీ సమన్వయకర్త డాక్టర్ ఈవూరి గణేష్, బాపుడా చైర్మన్ దేవినేని మల్లికార్జునరావుతో కలసి మార్చి 3వ తేదీన మేదరమెట్ల వద్ద సభ నిర్వహించనున్న సిద్ధం సభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అర్హులైన ప్రతి పేదవాడికి సంక్షేమ పథకాలు అందించిన ఘనత వైఎస్ జగన్‌కే దక్కుతోందని చెప్పారు. రాబోయే 2024 సార్వత్రిక ఎన్నికల్లో అధికారమే లక్ష్యంగా ప్రతిపక్షాలన్నీ ఏకమవుతున్నాయని, వారందరిని ప్రజాబలంతో ఢీకొటేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సిద్ధమయ్యారన్నారు. ప్రతి గ్రామ పంచాయతీ నుంచి నాయకులు పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులను తీసుకువెళ్లేలా ఏర్పాటులు చేయాలని నాయకులకు సూచించారు. రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరి గణేష్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చటంతో పాటు అభివృద్ధికి పెద్ద పీట వేశరన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మత్తి దివాకర రత్న ప్రసాద్, పార్టీ కన్వీనర్ పైనం ఏడుకొండల రెడ్డి, నాయకులు చెన్ను కోటేశ్వరరావు, కామినేని కోటేశ్వరరావు, బండారు రామారావు, అబ్దుల్ సమద్, మరివాడ శివప్రసాద్, చీరాల వెంకటేశ్వరరెడ్డి, తురిమెళ్ల శ్రీధర్, దొంతిబోయిన వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

నాట్కో క్యాన్సర్ సెంటర్‌లో డైనింగ్ హాల్

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్ నాట్కో క్యాన్సర్ సెంటర్‌లో నూతనంగా రూ.10 లక్షలతో నిర్మించిన డైనింగ్ హాల్‌ను సోమవారం నాట్కో ఫార్మ వ్యవస్థాపకులు, చైర్మన్ వీసీ నన్నపనేని, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్‌తో కలిసి ప్రారంభించారు. క్యాన్సర్ సెంటర్‌కు అదనంగా కేటాయించిన స్థలంలో వసతులు ఏర్పాటుపై వీ.సీ. నన్నపనేని సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్, వివిధ విభాగధిపతులతో చర్చించారు. ఈ సందర్భంగా డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ ఈ క్యాన్సర్ సెంటర్‌కు రోజుకు వందలాది మంది క్యాన్సర్ రోగులకు సేవలు అందిస్తున్నదని, ప్రభుత్వ ఆసుపత్రి నాట్కో క్యాన్సర్ సెంటర్ కార్పొరేట్ ఆసుపత్రిగా ఎదిగిందని చెప్పారు. ఆసుపత్రిలో పని చేసే సిబ్బందికి డైనింగ్ హాలును అందుబాటులో తీసుకుని రావడమే కాకుండా ఎంతో అందంగా తీర్చిదిద్దారని తెలిపారు. స్కూల్ ఆఫ్ నర్సింగ్ భవనం నిర్మించాలని కోరుతూ డాక్టర్ కిరణ్ కుమార్ నన్నపనేని వెంకన్న చౌదరికి వినతి పత్రం అందచేశారు. కార్యక్రమంలో క్యాన్సర్ వైద్య నిపుణులు డాక్టర్ దుర్గా ప్రసాద్, డాక్టర్ శివరామకృష్ణ, డాక్టర్ వెంకట రెడ్డి, డాక్టర్ జాహ్నవి, డాక్టర్ మురళి, డాక్టర్ శ్రీనివాస్, నర్సింగ్ సూపరింటెండెంట్ ఆషా సజని, నాట్కో వైస్ చైర్మన్ నన్నపనేని సదాశివ రావు, సమన్వయ కర్త యడ్లపాటి అశోక్ కుమార్ పాల్గొన్నారు.

మళ్లీ సీఎంగా జగనన్నను చేసుకుందాం

చీరాల సమన్వయకర్త కరణం వెంకటేష్

చీరాల టౌన్: సంక్షేమ రథసారథి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకుందామని వైఎస్సార్ సీపీ చీరాల సమన్వయకర్త కరణం వెంకటేష్ పిలుపునిచ్చారు. మండలంలోని దేవాంగపురి గ్రామ సచివాలయం-1లో ‘గడప గడపకు మన ప్రభుత్వం’ కార్యక్రమంలో భాగంగా లబ్ధిదారులతో ముఖాముఖి కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 2019లో సీఎంగా అధికారం చేపట్టినప్పటి నుంచి రాష్ట్ర ప్రజల సంక్షేమం, రాష్ట్రాభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్నట్లు చెప్పారు. దేశంలో ఏ రాష్ట్రం ఇవ్వని సంక్షేమ పథకాలను నేరుగా అందించిన ఘనత సీఎం జగనన్నకే దక్కిందని పేర్కొన్నారు. త్వరలో జరిగే ఎన్నికల్లో ఫ్యాన్ స్పీడ్‌కు ప్రతిపక్షాలు గల్లంతవడం ఖాయమని ఎద్దేవా చేశారు. నవరత్నాలు, పేదలందరికీ ఇళ్లు, మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల్లో 96 శాతం వరకు నెరవేర్చి అన్నీ వర్గాల సంక్షేమానికి పాటుపడుతూ ఆర్థిక సుస్థిరత కల్పించిన సీఎం జగనన్న మళ్లీ సీఎం అయితేనే పథకాలు అంది పేదలు వృద్ధి చెందుతారని వెంకటేష్ పేర్కొన్నారు. ఓటర్లు అందరు జగనన్నను సీఎంగా మళ్లీ గెలిపించుకునేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. అనంతరం ప్రజలకు సంక్షేమ పథకాల బుక్‌లెట్లు అందించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, కార్పొరేషన్ డైరెక్టర్ జి.శ్రీనివాసరావు, పార్టీ మండల అధ్యక్షుడు అసోది అంకాళరెడ్డి, ఎస్టీ సెల్ అధ్యక్షుడు ఎస్.రాజ్‌కుమార్, నాయకులు బి.సుబ్బారావు, పి.ధనుంజయ్, అశోక్, హరీష్, హనుమంతరావు, శివప్రసాద్‌రెడ్డి, బాలకోటిరెడ్డి, ప్రేమ్‌చంద్, శ్రీనివాస రెడ్డి, వరప్రసాద్, రత్నారెడ్డి, వెంకటేశ్వరమ్మ, జయరావు, శ్రీనివాసరావు, దుర్గా మహేష్, రాజేశ్వరరావు పాల్గొన్నారు.


దేవాంగపురిలో లబ్ధిదారులకు బుక్‌లెట్లు అందిస్తున్న సమన్వయకర్త వెంకటేష్

గడువులోగా అర్జీలు పరిష్కరించాలి

అడిషనల్ ఎస్పీ మహేష్


అర్జీదారుల సమస్యలను తెలుసుకుంటున్న అడిషనల్ ఎస్పీ పి. మహేష్

బాపట్లటౌన్: స్పందన అర్జీలను సత్వరమే పరిష్కరించాలని జిల్లా అడిషనల్ ఎస్పీ పి. మహేష్ తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి 56 మంది అర్జీదారులు తమ సమస్యలను అడిషనల్ ఎస్పీ పి.మహేష్‌కు వివరించారు. బాధితుల సమస్యలను తెలుసుకున్న ఏఎస్పీ సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులతో మాట్లాడి సమస్యలను వెంటనే పరిష్కరించేలా చూడాలన్నారు. ఏఎస్పీ పి.మహేష్ మాట్లాడుతూ బాధితుల సమస్యలకు సంబంధిచిన పూర్వాపరాలను అడిగి తెలుసుకొని, వాటిని చట్టపరిధిలో పరిష్కరించాలన్నారు. స్పందన అర్జీలను నిర్దేశించిన గడువులోగా పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో స్పందన సెల్ సీఐ సిహెచ్. సింగయ్య పాల్గొన్నారు.

గోవాడ తిరునాళ్లకు భారీ పోలీసు బందోబస్తు


గోవాడ శ్రీబాల కోటేశ్వరస్వామి దేవస్థానాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ మురళీకృష్ణ

గోవాడ(వేమూరు): అమృతలూరు మండలంలోని గోవాడలోని శ్రీ బాల కోటేశ్వరస్వామి దేవస్థానంలో మహాశివరాత్రి ఉత్సవాలకు భారీగా పోలీసు బందో బస్తు ఏర్పాటు చేయనున్నట్లు రేపల్లె డీఎస్పీ టి.మురళీకృష్ణ తెలిపారు. సోమవారం ఆలయాన్ని పరిశీలించారు. దేవస్థానం అధికారి, గ్రామ పంచాయతీ కార్యదర్శితో మాట్లాడారు. మహా శివ రాత్రి ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులకు గురి కాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. దేవుని దర్శనం కోసం భక్తులు ఇలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో చుండూరు, వేమూరు, రేపల్లె సీఐలు శ్రీనివాసరావు, పసుపులేటి రామకృష్ణ, మల్లికార్జునరావు, ఎస్ఐ నవీన్ పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో భారీగా చేరికలు


బల్లికురవ బీఎస్పీ నాయకులకు పార్టీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న సమన్వయకర్త చిన హనిమిరెడ్డి

- బీఎస్పీ నుంచి వంద కుటుంబాలు..
- కండువా కప్పి ఆహ్వానించిన సమన్వయకర్త చిన హనిమిరెడ్డి

అద్దంకి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సంక్షేమ పాలనతోనే టీడీపీతో పాటు ఇతర పార్టీల నాయకులు పార్టీలో చేరుతున్నారని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త పానెం చిన హనిమిరెడ్డి పేర్కొన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో సోమవారం బల్లికురవ మండలానికి చెందిన బీఎస్పీ ఇన్‌చార్జి సురభి ప్రభాకర్, సురభి మహేశ్‌తో పాటు వంద కుటుంబాలు ఆ పార్టీకి రాజీనామా చేసి మండల వైస్ ఎంపీపీ ఇప్పల వెంకట సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో సోమవారం వైఎస్సార్ సీపీలో చేరారు. వారికి పార్టీ సమన్వయకర్త చిన హనిమిరెడ్డి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన కుటుంబాల్లో మండలిలోని కూకట్లపల్లి, కొప్పరపాలెం, ఇతర గ్రామాల నుంచి వచ్చినవారు ఉన్నారు. ఈ సందర్భంగా హనిమిరెడ్డి మాట్లాడుతూ ప్రభాకర్ సోదరుడు బంధువులు కార్యకర్తలతో వైఎస్సార్ సీపీలో చేరడం సంతోషదాయకం అన్నారు. ఇప్పటికే టీడీపీ నుంచి వేలాది కుటుంబాలు వైఎస్సార్ సీపీలో చేరాయని చెప్పారు. మిగిలిన పార్టీల నుంచీ వైఎస్సార్ సీపీలోకి ఇక ముందు ఉంటాయని పేర్కొన్నారు. టీడీపీ, జనసేన కలిసి రాష్ట్రంలో ఏదో సృష్టించాలని చూస్తున్నారని ఎద్దేవా చేశారు. ఎంత మంది ఒకటైనా గెలిచేది వైఎస్సార్ సీపీనేనని అన్నారు. ప్రతి కార్యకర్త, నాయకుడు జగనన్న పాలనలో నిర్వహించిన అభివృద్ధి సంక్షేమ పథకాల గురించి ఇతరులకు చెప్పాలన్నారు. పార్టీ పటిష్టంగా ఉండి, పాలన బాగుంటే మనం పిలవకుండానే ఎంతో మంది నాయకులు, కార్యకర్తలు మన వైపు వస్తారనడానికి ఇవే ఉదాహరణ అని చెప్పారు.

సొంతగూటికి చేరిన వైఎస్సార్ సీపీ నాయకులు..

అద్దంకి రూరల్: టీడీపీ నాయకుల బెదిరింపులకు భయపడి ఆదివారం వైఎస్సార్ సీపీని వీడి టీడీపీలో చేరిన అద్దంకిలోని 13వ వార్డులోని నాయకులు దొండపాటి వెంకటరావు, నవీన్ తిరిగి మళ్లీ సోమవారం రాత్రి స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో హనిమిరెడ్డి సమక్షంలో చేరారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్ని ప్రలోభాలకు గురిచేసినా లొంగేది లేదని, తామంతా హనిమిరెడ్డి గెలుపు కోసం కృషిచేస్తామని ప్రతినబూనారు.

వైఎస్సార్ సీపీ జెండా ఎగరాలి


నాయకులు, కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న సమన్వయకర్త బాలాజీ

పర్చూరు సయన్వయకర్త యడం బాలాజీ

కారంచేడు: నా దేవుడే నాకు ఫోన్ చేసి పర్చూరు నియోజకవర్గ సమన్వయకర్తగా నియమించారని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని ఉద్దేశించి వైఎస్సార్ సీపీ పర్చూరు నియోజకవర్గ సమన్వయకర్త యడం బాలాజీ భావోద్వేగంతో చెప్పారు. స్థానిక డాక్టర్ దగ్గుబాటి రామానాయుడు కల్యాణ మండపంలో కార్యకర్తల సమావేశం సోమవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 2014లో కూడా తనకు చీరాల ఎమ్మెల్యే సీటును జగనన్న కేటాయించినప్పుడు నాకు పెద్దగా రాజకీయ అనుభవం కూడా లేదన్నారు. అయినా కష్టపడి పనిచేశానన్నారు. మళ్లీ జగనన్న నాకు ఫోన్ చేసి పర్చూరు సీటును కేటాయించడం ఎంతో అదృష్టంగా భావిస్తున్నాని పేర్కొన్నారు. పర్చూరు నియోజకవర్గ ప్రజలు నిన్ను ఆదరిస్తారని అక్కడకు వెళ్లి పనిచేయాలని జగనన్న సూచించారని చెప్పారు.

తక్కువ సమయంలో ఎక్కువ పనిచేయాలి..

ఎన్నికలకు చాలా తక్కువ సమయం మాత్రమే ఉందని యడం బాలాజీ చెప్పారు. ఉన్న కొద్ది సమయాన్ని పార్టీ కోసం కష్టపడి చేసి విజయపథంలో నడిపిద్దామని పేర్కొన్నారు. ఇకపై గ్రూపు రాజకీయాలు ఉండవని, వైఎస్సార్ సీపీకి చెందిన ప్రతి నాయకుడు, కార్యకర్త నా కుటుంబమేనన్నారు. మీరు ఏ సమయంలోనైనా ఏ పని నిమిత్తమైనా తనను కలవచ్చాన్నారు. 2024 ఎన్నికల్లో ప్రతి ఒక్కరం సమన్వయంగా పనిచేసి మన జగనన్నను ముఖ్యమంత్రిని చేసుకోవడం కోసం కృషి చేద్దామన్నారు. జగనన్నకు మీకు నేను వారధిలాంటి వాడినని, మీ ఇంటి పెద్ద బిడ్డగా నేనుంటానన్నారు. పర్చూరు నియోజకవర్గంలోను రాబోవు ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ జెండాను ఎగరవేడానికి మనందరం కష్టపడదామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ నీరుకట్టు వాసుబాబు, జెడ్పీటీసీ సభ్యురాలు యార్లగడ్డ రజనీశ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ యార్లగడ్డ సుబ్బారావు, మాజీ వైస్ ఎంపీపీ యార్లగడ్డ వెంకటేశ్వరావు, జేసీఎస్ మండల కన్వీనర్ యార్లగడ్డ శ్రీకాంత్, పార్టీ మండల అధ్యక్షుడు దండా చౌదరిబాబు, మండల కోఆప్షన్ మెంబర్ ముల్లా నూర్‌అహ్మద్, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు గేరా రవీంద్రనాథ్‌ఠాగూర్ పాల్గొన్నారు. సమన్వయకర్తగా బాధ్యతలు తీసుకున్న తరువాత మొదటిసారిగా కారంచేడు మండలంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరయ్యారు.

అభివృద్ధికి కేరాఫ్ అద్దంకి

రూ.500 కోట్లతో అభివృద్ధి పనులు

అద్దంకి: అద్దంకి పురాతనమైన పట్టణం. క్రీస్తు శకం 2000 ఏళ్ల క్రితమే అద్దంకి పట్టణంగా ఉన్నట్లు చారిత్రక ఆధారాలున్నాయి. ఎంతో మంది రాజులు అద్దంకిని రాజధానిగా చేసుకుని పరిపాలన సాగించినట్లు దొరికిన పురావస్తు శాసనాల ద్వారా తెలుస్తోంది. అలాంటి నేపథ్యం ఉన్న పట్టణంలో ఎంతో కాలంగా నిర్లక్ష్యానికి గురైంది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ రాకతో నియోజకవర్గాల్లోని గ్రామాలు, పట్టణాల రూపురేఖలు మారాయి. అద్దంకి పట్టణాన్ని సుందరంగా తీర్చి దిద్దారు. నియోజకవర్గంలో ఇప్పటికి రూ.500 కోట్ల వరకు డీబీటీ, నాన్ డీబీటీ కాకుండా అభివృద్ధి పనులు జరాగాయి.గత ప్రభుత్వంలో వలే పార్టీకి ఓటు వేసిన వారికే పథకాలు కాకుండా కుల, మత వర్గ పార్టీ చూడకుండా ప్రభుత్వం నాయకులు అర్హత కలిగిన ప్రతి ఇక్కరికీ పథకాలు అందించారు.


అద్దంకి పట్టణంలోని బంగ్లా రోడ్


పట్టణంలో నిర్మించిన యూపీహెచ్‌సీ

నియోజకవర్గంలో అభివద్ధి ఇలా..

వైఎస్సార్ సీపీ హయంలో అద్దంకి పట్టణానికి పనుల కోసం రూ.200 కోట్లకు పైనే నిధులు మంజూరయ్యాయి. పట్టణంలో నూతనంగా రూ.26 కోట్లతో రెండు యూపీహెచ్‌సీలు ఒకటి గొర్లమిట్ట, రెండోది గరటయ్య కాలనీ సమీపంలో నిర్మించారు. ప్రకాశం ప్రభుత్వ కళాశాల ఆవరణలో పార్కు, జిమ్ సెంటర్ ఏర్పాటు చేశారు. రూ.85 కోట్లతో తాగునీటి పథకం రీ ఎస్టిమేట్‌తో పూర్తి కావచ్చింది. త్వరలో ఇంటింటికీ కుళాయి ఏర్పాటు చేయనున్నారు. అదే వి. ధంగా బంగ్లా రోడ్‌ను విస్తరించారు. ఈ రోడ్డుతో పాటు, దర్శి-అద్దంకి రహదారిలో, అద్దంకి-నార్కెట్‌పల్లి రాష్ట్రీయ రహదారిలో సెంటరు లైటింగ్ డివైడర్ ఏర్పాటు చేసి మధ్యలో మొక్కలు పెంచారు. సీసీ రహదారులు సీసీ డ్రైనేజీలు నిర్మించారు. ఈ విధంగా పట్టణాన్ని సుందరంగా మార్చారు.


సిద్ధమైన పార్కు, జిమ్‌సెంటర్

పట్టణాభివృద్ధికి ప్రాధాన్యం

గతంలో నియోజకవర్గంలో ముఖ్యమంత్రి ఎన్నో నిధులు మంజూరు చేశారు. దాంతో పట్టణంతోపాటు మండలాల్లో ఎన్నో పనులు జరిగాయి. ఇక రాబోయే కాలంలో ఆంధ్రప్రదేశ్‌లో అభివృద్ధికి చిరునామాగా అద్దంకిని మారుస్తా. ఇంజినీరింగ్ కలాశాల, 100 పడకల వైద్యశాలు, ఇతర అవసరమైన సౌకర్యాలను తప్పకుండా ఏర్పాటు చేయిస్తా. అందుకు నాకు ముందే నాకు దిశా నిర్దేశం చేశారు. దానికి నేను కట్టుబడి పనిచేసి అద్దంకిలో వైఎస్సార్ మార్కు పాలన అందిస్తాం.
– పానెం చిన హనిమిరెడ్డి, వైఎస్సార్ సీపీ సమన్వయకర్త, అద్దంకి

సీఎం వైఎస్ జగన్ స్ఫూర్తితో సేవా కార్యక్రమాలు

- బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ
- వేజండ్లలో ఒక్కరోజే 1475 మందికి నేత్ర, హృద్రోగ పరీక్షలు


పరీక్షలు చేయించుకున్న గ్రామస్తులతో అంబటి మురళీకృష్ణ

వేజండ్ల(చేబ్రోలు): ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు అందిస్తున్న సంక్షేమ ఫలాలను స్ఫూర్తిగా తీసుకొని ‘బజరంగ్ జగన్నామ సంక్షేమ సంగమం ’కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్టు ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ అన్నా రు. చేబ్రోలు మండలం వేజండ్ల గ్రామంలో సోమ వారం జగన్నామ సంక్షేమ సంగమం వైద్య శిబిరం జరిగింది. ఈ శిబిరానికి 1475 మంది గ్రామస్తులు తరలిరాగా నిపుణులైన వైద్యులు కంటి పరీక్షలు, గుండె పరీక్షలు చేశారు. వీటితో పాటు ఫిజియోథెరపీ సేవలను అందించారు. వీరిలో 20 మందికి యాంజియోగ్రామ్ పరీక్ష అవసరమని వైద్యులు సూచించారు. శిబిరం అనంతరం బజరంగ్ విద్యా విజేత కార్యక్రమంలో భాగంగా స్థానిక జెడ్పీ హైస్కూల్‌లోని 650 మంది విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్స్‌ను అందజేశారు. అంబటి మురళీకృష్ణ మాట్లాడుతూ ఉచిత నేత్ర వైద్య పరీక్షల అనంతరం అవసరమైన వారికి ఏడు పని దినాల్లో కళ్లజోళ్ల పంపిణీ చేస్తామన్నారు. గుండెకు సంబంధించి యాంజియోగ్రామ్ పరీక్ష అవసరమైన వారిని బుధవారం ఉదయం ప్రత్యేక బస్సులో విజయవాడ తీసుకువెళ్లనున్నట్టు వివరించారు.